ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 14 మే 2024

యంత్రాలలో భవితవ్యం

పోలింగ్ సోమవారం రాత్రి 10 గంటల తరువాత ముగిసింది. ఓటర్ల తీర్పు ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగేదాకా అభ్యర్థుల భవితవ్యం అందులోనే ఉంటుంది. ఈవీఎంలను పటిష్ట పోలీసు భద్రత నడుమ జేఎన్‌టీయూలోని స్ట్రాంగ్ రూంలకు తరలించారు.





పాతూరు రాణినగర్ ఆశా స్కూల్ వద్ద..



ఉదయం 6.30గంటలకే ఝాన్సీబాయి లక్ష్మీ స్కూల్ వద్ద బారులు తీరిన ఓటర్లు

అనంతపురం/టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం పరిఢవిల్లింది. వ్యవస్థలను రక్షించుకునేందుకు, హక్కులను కాపాడుకునేందుకు ఓటరు వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఓటరు చైతన్యానికి అద్దం పట్టింది. ఏ పోలింగ్ కేంద్రంలో చూసినా జన జాతర కనిపించింది. యువ ఓటర్లు మరింత ఉత్సాంగా కనిపించారు. మహిళలు బారులుతీరారు. పోలింగ్ సమయం సాయంత్రం 6 గంటలకే అయినా.. అప్పటి వరకూ క్యూలో ఉన్నవారు ఓటేసేందుకు రాత్రి 10 గంటలు అయ్యింది.

ఓటు జాతర

పోటెత్తిన పోలింగ్ కేంద్రాలు

- కొత్త ఓటర్లలో ఉత్సాహం ఉరకలు
- బారులు తీరిన మహిళలు
- వైసీపీ కుట్రలు పటాపంచలు
- జిల్లాలో 75.63 శాతానికి పైగా పోలింగ్
- రాప్తాడులో అత్యధికంగా 81.41శాతం
- అనంత అర్బన్‌లో అత్యల్పంగా 64.05 శాతం





వైసీపీ కుట్రలు పన్నినా..

పోలింగ్ సందర్భంగా అధికార వైసీపీ అలజడులు సృష్టించింది. ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోకుండా భయభ్రాంతులకు గురిచేయాలని చూసింది. ఇలా జరుగుతుందని వారం ముందే ప్రచారం జరిగింది. వైసీపీ కుట్రలు పన్నుతోందని టీడీపీ కూటమి, ఇతర పక్షాలు ఆరోపించాయి. అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీన్ని నిజం చేస్తూ.. తాడిపత్రి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆయన తనయులు, అనుచరవర్గం వీరంగం సృష్టించారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినా, దాడులను నిలువరించలేకపోయారు. దెబ్బకు ఓటర్లు భయభ్రాంతులకు గురవుతారని వైసీపీ భావించినా... ఓటరు ఎక్కడా వెనుకడుగు వేయలేదు. రాప్తాడు, గుంతకల్లు, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నా.. ఓటర్లు మాత్రం ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు కయ్యానికి కాలు దువ్వినా.. కూటమి నేతలు, కార్యకర్తలు ఎక్కడా సహనం కోల్పోలేదు. పోలింగ్ పైనే దృష్టి సారించారు. ఈ ఎన్నికల్లో ఇది విశేషం.

పోలింగ్ సరళి ఇలా..

అనంతపురం ఎంపీ, రాప్తాడు, అనంతపురం అర్బన్, కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి అసెంబ్లీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరిగింది. ఉదయం 6.45 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాల్సి ఉన్నా.. ఈవీఎంలు మొరాయించడంతో చాలాచోట్ల అర గంట నుంచి గంట దాకా ఆలస్యమైంది. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఉదయం 9 గంటలకు 9.17 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత రెండు గంటల వ్యవధిలో అమాంతం పెరిగి. 11 గంటలకు 23.03 శాతానికి చేరింది. మధ్యాహ్నం ఒంటి గంటకు 38.35 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తరువాత మందకొడిగా సాగి.. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి ఊపందుకుంది. సాయంత్రం 5 గంటలకు 63.27 శాతం పోలింగ్ నమోదైంది. రాత్రి 10 గంటల దాకా కొనసాగింది. అధికారిక వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు రాత్రి 8 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 75.63 శాతం పోలింగ్ నమోదైంది.

రాప్తాడు అత్యధికం

జిల్లా మొత్తం 20,18,162 మంది ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి ఎక్కువగా ఓటుహక్కు వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి 8 గంటల వరకు జరిగిన పోలింగ్ శాతాన్ని ఆయన విడుదల చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో అత్యధికంగా 81.41శాతం పోలింగ్ నమోదైంది. శింగనమలలో 80.13 శాతం, ఉరవకొండలో 80.04 శాతం నమోదైంది. అత్యల్పంగా అనంతపురం అర్బన్‌లో 64.05 శాతం పోలింగ్ నమోదైంది..









బుక్కరాయసముద్రంలో బారులు తీరిన ఓటర్లు





విద్యుత్‌నగర్‌లోని అరవిందఘోష్ స్కూల్‌లో..





మేము సైతం..



గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి స్కూల్‌లో..

బుక్కరాయసముద్రంలో ఓటర్లకు వందనాలు..

పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ కవ్వింపులు.. బెదిరింపు చర్యలకు దిగింది. టీడీపీ వర్గీయులు ఎదురు తిరిగినచోట కర్రలు, రాళ్లతో విరుచుకుపడింది. ఈ దాడులలో పలువురు ఓటర్లు, టీడీపీ వర్గీయులు, ఓ బీఎస్ఎఫ్ జవాను గాయపడ్డారు. తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాలలో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఓటమి భయంతో.. పోలింగ్‌ను అడ్డుకునేందుకు వైసీపీవారు ఇలా వ్యవహరించారని టీడీపీ కూటమి అభ్యర్థులు మండిపడ్డారు.

రణరంగం





రాళ్లు రువ్వుకుంటున్న ఇరువర్గాలు



ధ్వంసమైన జేసీ అశ్మిత్‌రెడ్డి కారు అద్దాలు



రాళ్ల వర్షం

యాడికి మండలంలోని కోనుప్పలపాడులో టీడీపీ వర్గీయులు శేఖర్, ఓబన్న, కేశవ, చంద్రలపై వైసీపీ వర్గీయులు చంద్రబాబు, గంగిరెడ్డి దాడిచేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం నిర్వహిస్తున్నారని టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఒకరికొకరు రాళ్లు, కట్టెలతో దాడులు చేసుకున్నారు. పెద్దవడుగూరు మండలం దిమ్మగుడిలో టీడీపీ, వైసీపీ వర్గీయులు దాడులు చేసుకున్నారు. దాడుల్లో ఒకరికి గాయాలయ్యాయి. పెద్దపప్పూరు మండలంలోని వరదాయపల్లి గ్రామంలో పోలింగ్ బూత్‌లోకి వైసీపీ మద్దతుదారుడు దూసుకురావడంతో టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు మాటమాట పెరిగి దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో టీడీపీ మద్దతుదారుడు నారాయణస్వామి, శ్రీనివాసులు గాయపడ్డారు.



చికిత్స పొందుతున్న టీడీపీ వర్గీయుడు శేఖర్

దాడిపత్రి

వీధుల్లో తలపడ్డ వైసీపీ, టీడీపీ వర్గీయులు

వైసీపీ రాళ్లదాడిలో పలువురికి గాయాలు



అడిషనల్ ఎస్పీతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి





గాయపడ్డ నారాయణ స్వామి, శ్రీనివాసులు

తాడిపత్రి టౌన్: పోలింగ్ రోజున తాడిపత్రి రణరంగంగా మారింది. వైసీపీ, టీడీపీ వర్గీయుల రాళ్ల దాడులతో దద్దరిల్లి పోయింది. ఓంశాంతినగర్ పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారన్న సమాచారం అందుకున్న టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అక్కడికి వెళ్లారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పెద్దారెడ్డి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఆయనకు జేసీ అనుచర వర్గం ఎదురుపడింది. దీంతో ఒకరికొకరు కేకలు వేసుకుంటూ మీరెంత అంటే మీరెంత అంటూ వాగ్వాదానికి దిగారు. మాటమాట పెరిగి రాళ్లు రువ్వుకున్నారు. దీంతో బీఎస్ఎఫ్ జవాన్‌తోపాటు మరో నలుగురు వృద్ధ ఓటర్లకు గాయాలయ్యాయి. పెద్దారెడ్డి రెండు కార్లు, జేసీ అశ్మిత్‌రెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. డీఐజీ షేముషి, ఎస్పీ అమిత్ బర్దర్, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. దీంతో పోలింగ్ సజావుగా సాగింది.

ఎవర్రా నువ్వు? ఎందుకు వచ్చావ్..?

'నీకు తాడిపత్రిలో ఏం పని? నువ్వు రాయదుర్గంలో చూసుకోవాలి కదా? ఎవర్రా నువ్వు? ఎందుకు వచ్చావ్?' అంటూ మాజీ ఎమ్మెల్సీ దీపక్ రెడ్డిపై వైసీపీ అభ్యర్థి పెద్దారెడ్డి దూషించారు. పాతకోటలో పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ సరళిని పరిశీలించడానికి వచ్చిన దీపక్‌రెడ్డిని చూసి పెద్దారెడ్డి రెచ్చిపోయారు. డీఎస్పీ గంగయ్య జోక్యం చేసుకుంటూ పెద్దారెడ్డికి సర్దిచెబుతూ పక్కకు తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి అక్కడకు చేరుకొని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో 'అతనెందుకు వచ్చాడు? వెళ్లిపోమను' అంటూ అడిషనల్ ఎస్పీ రామకృష్ణపై పెద్దారెడ్డి చిందులు వేశారు. 'నాపై దాడిచేసేందుకు తెలుగుదేశం పార్టీ వారితో సుపారీ తీసుకున్నావా?' అని విరుచుకుపడ్డాడు. డీఎస్పీ ఇరుపార్టీలకు సర్దిచెప్పి పంపించారు.

జేసీ పవన్‌ను అడ్డుకున్న పోలీసులు

పట్టణంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళుతున్న టీడీపీ నాయకుడు జేసీ పవన్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. నందలపాడు ఫ్లైఓవర్ వద్ద వెళుతున్న జేసీ పవన్‌రెడ్డి కారును డీఐజీ షేముషి, డీఎస్పీ గంగయ్య నిలిపారు. మందీమార్బలంతో వెళ్లకూడదని సూచించారు. దీంతో పెద్దారెడ్డి తనయులు మందీమార్బలంతో వెళుతుంటే మీరేం చేస్తున్నారని జేసీ పవన్‌రెడ్డి వారిని ప్రశ్నించారు. ముందుగా వారిని హౌస్ అరెస్ట్ చేయాలని, తర్వాత తానే ఇంటికి వెళ్లిపోతానని అన్నారు.



డీఎస్పీని ప్రశ్నిస్తున్న జేసీ పవన్

టీడీపీ ఏజెంట్లపై దాడి

పాతకోట, వైఎస్ఆర్ కమ్యూనిటీహాలు పోలింగ్‌కేంద్రాల్లో ఉన్న టీడీపీ ఏజెంట్లు అసిఫ్, బాషాపై వైసీపీ మద్దతుదారులు దాడిచేశారు. వైసీపీ నాయకులు ప్రలోభపెడుతుండటాన్ని గమనించిన టీడీపీ ఏజెంట్లు ప్రశ్నించారు. మాటమాట పెరిగి టీడీపీ ఏజెంట్లపై పిడిగుద్దులు గుద్దారు. దీపక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు.

చెదరగొట్టిన పోలీసులు

కణేకల్లు నేసేపేట వద్ద టీడీపీ బూత్ కన్వీనర్ రజాక్, నాయకులు శ్రీకాంత్, ముస్తాఫాపై వైసీపీ నాయకులు దాడికి యత్నించారు. పోలింగ్ కేంద్రం వద్ద కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దాదాపు 70 మంది గుంపుగా వచ్చి ఇష్టానుసారంగా దూషించారు. పోలీసులు సంఘటన ఇరువర్గాలను చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న కాలవ శ్రీనివాసులు కణేకల్లుకు చేరుకుని బాధితులకు ధైర్యం చెప్పారు. డీఎస్పీ శ్రీనివాసులుకు ఫోన్ చేసి దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గొడవ జరిగిన ప్రాంతంలో లాఠీ ఝుళిపిస్తున్న పోలీసులు



ఓబులాపురంలో ఘర్షణ

పుట్లూరు మండలంలోని ఓబులాపురంలో పోలింగ్ ముగిశాక టీడీపీ, వైసీపీ వర్గీయులు ఘర్షణపడ్డాయి. ఓ వృద్ధుడితో టీడీపీకి ఓటు వేయించారన్న నెపంతో ఇద్దరి మధ్య మాట మాట పెరిగి.. రాళ్లు, కట్టెలతో దాడులు చేసుకున్నారు. టీడీపీ వర్గీయులు రాంమోహన్, లోకనాథ్, వైసీపీ వర్గీయులు కృష్ణయ్య, రమణ, సుధాకర్‌రెడ్డి గాయపడ్డారు. వీరిని తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి సీఐ సుబ్రహ్మణ్యం చేరుకొని పరిస్థితిపై ఆరాతీశారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

రెచ్చిపోయిన వైసీపీ వర్గీయులు

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై దాడులు

టీడీపీ అభ్యర్థి అల్లుడి కారు అద్దాలు ధ్వంసం

కళ్యాణదుర్గం:

- కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్ది పోలింగ్ కేంద్రంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య పార్టీ కండువా వేసుకుని పోలింగ్ బూత్‌లోకి వెళ్లారు. అక్కడున్న ఎన్నికల అధికారులు పట్టించుకోలేదు. కుందుర్పి మండలం ఎనుములదొడ్డి, మలయనూరు, ఎర్రగుంట, వడ్డెపాళ్యం, బెస్తరపల్లిలో వైసీపీ నాయకులు టీడీపీ వర్గీయులపై దాడికి దిగారు. ఎనుములదొడ్డిలో పోలీస్ సిబ్బంది తక్కువగా ఉండడంతో వైసీపీ నాయకులు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ఈ క్రమంలో వైసీపీ, టీడీపీ వర్గీయులు ఘర్షణకు దిగారు. తోపులాటలో హృద్రోగి కావేలమ్మ స్పృహతప్పి పడిపోయారు. అక్కడున్న వైద్య సిబ్బంది ఆమెకు చికిత్స చేశారు. అనంతరం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.
- ఎర్రగుంట టీడీపీ నాయకుడు ఆనంద్ చేతిని వైసీపీ నాయకుడు ఒకరు కరిచారు. మలయనూరులో టీడీపీ వర్గీయులపై వైసీపీ నాయకులు దాడికి దిగారు. బెస్తరపల్లిలో టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు ధర్మతేజ కారుపై రాళ్లు రువ్వి అద్దాలను ధ్వంసం చేశారు. మలయనూరు పంచాయతీలో పోలింగ్ బూతు నెంబర్ 184, 185, 186లో ఓటు వేయకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. ఈ పోలింగ్ స్టేషన్ల వద్ద తరచూ గొడవలకు దిగుతూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. ఇక్కడ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయలేదు.
- కంబదూరు మండలం వైసీపల్లిలో పోలింగ్ అధికారి వైసీపీ నాయకుడితో కుమ్మకై వైసీపీకి దొంగ ఓట్లు వేయిస్తున్నారన్న సమాచారంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలింగ్ అధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.



- శెట్టూరు మండలం అయ్యగార్లపల్లిలో దళిత యువకుడు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి రావడంతో వైసీపీ వర్గీయులు అడ్డుపడి దాడికి యత్నించారు. ఖైరేవులో ఎన్నికల విధుల్లో ఉన్న ఓ పోలింగ్ అధికారి లోలోపలే వైసీపీకి ఓటు వేయాలని సూచించారు. దీంతో టీడీపీ, వైసీపీ వర్గీయులు మధ్య ఘర్షణకు దిగారు.



కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్దెలో పార్టీ కండువా వేసుకుని పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య



కంబదూరు మండలం వైసీపల్లిలో వైసీపీకి ఓట్లు వేయిస్తున్నారని అధికారిని నిలదీస్తున్న టీడీపీ వర్గీయులు

ధర్మవరం

మొత్తం ఓటర్లు	2,45,758
పోలింగ్ శాతం	76.10

రాయదుర్గం

మొత్తం ఓటర్లు	2,64,352
పోలింగ్ శాతం	77.06

అనంతపురం

మొత్తం ఓటర్లు	2,81,214
పోలింగ్ శాతం	64.5

ఉరవకొండ

మొత్తం ఓటర్లు	2,24,339
పోలింగ్ శాతం	80.4

గుంతకల్లు

మొత్తం ఓటర్లు	2,70,648
పోలింగ్ శాతం	71.56

తాడిపత్రి

మొత్తం ఓటర్లు	2,48,880
పోలింగ్ శాతం	77.58

శింగనమల

మొత్తం ఓటర్లు	2,47,373
పోలింగ్ శాతం	80.13

కళ్యాణదుర్గం

మొత్తం ఓటర్లు	2,30,785
పోలింగ్ శాతం	79.4

రాప్తాడు

మొత్తం ఓటర్లు	2,50,571
పోలింగ్ శాతం	81.41

పుట్టపర్తి

మొత్తం ఓటర్లు	2,11,062
పోలింగ్ శాతం	70

కదిరి

మొత్తం ఓటర్లు	2,53,420
పోలింగ్ శాతం	81.37

మడకశిర

మొత్తం ఓటర్లు	2,11,074
పోలింగ్ శాతం	74.25

హిందూపురం

మొత్తం ఓటర్లు	2,49,174
పోలింగ్ శాతం	73.32

పెనుకొండ

మొత్తం ఓటర్లు	2,35,986
పోలింగ్ శాతం	79.77

అనంతపురం



రాప్తాడు మండలం బండమీదపల్లిలో ఓటుహక్కును వినియోగించుకున్న అనంతపురం అర్బన్ టీడీపీ అభ్యర్థి దగ్గుబాటి, నగరంలో వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి

శింగనమల



సిద్ధరాంపురంలో ఓటుహక్కును వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి శ్రావణిశ్రీ, సి.బండమీదపల్లిలో వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులు

రాప్తాడు



నసనకోటలో ఓటుహక్కును వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత, తోపుదుర్తిలో వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ధర్మవరం



అనంతపురం రుద్రంపేట పంచాయతీ పంతుల కాలనీలో ఓటు వేసిన ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్, ధర్మవరంలో వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

హమ్మయ్యా.. అయిపోయింది..!

ప్రజాతీర్పు యంత్రాల్లో నిక్షిప్తమైంది. ఎవరికి అనుకూలంగా ఉంటుందోనన్న ఉత్కంఠ కొన్నాళ్లు కొనసాగుతుంది. పోటీలో ఎందరున్నా.. కీలక పోరు టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్యనే ఉంటుందన్నది తేటతెల్లం. కాంగ్రెస్ ఓటు బ్యాంకు కాస్త పెరిగినట్లు కనిపిస్తోంది. ఫలితాలు జూన్ 4న బహిర్గతమౌతాయి. అంతవరకూ తమదే గెలుపు అని ఊహల్లో తేలిపోవచ్చు. ఏమౌతుందోనని ఉత్కంఠ ఎదుర్కోవచ్చు. ఓటర్లది సైతం ఇదే పరిస్థితి. ఆ రోజు కోసం ఎదురు చూస్తూ.. రోజులు లెక్కబెట్టడం మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు, ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

- అనంతపురం న్యూస్‌నెట్‌వర్క్

పుట్టపర్తి



పుట్టపర్తిలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, నల్లమాడ మండలంలో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కదిరి



కదిరిలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, షాహీపేట పాఠశాలలో వైసీపీ అభ్యర్థి మక్బూల్

కళ్యాణదుర్గం



కళ్యాణదుర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, వైసీపీ అభ్యర్థి తలారి రంగయ్య

తాడిపత్రి



తాడిపత్రిలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి

ఉరవకొండ



ఉరవకొండలో ఓటు వేస్తున్న టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్, వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి

గుంతకల్లు



ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం, వైసీపీ అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి

పెనుకొండ



ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి సవిత, వైసీపీ అభ్యర్థి ఉషశ్రీచరణ్

మడకశిర



ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు, వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్ప

రాయదుర్గం



ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు, వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

హిందూపురం



హిందూపురంలో ఓటుహక్కును వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ, వైసీపీ అభ్యర్థి దీపిక

పార్లమెంట్



హిందూపురం పార్లమెంటు పరిధిలో ఓటుహక్కును వినియోగించుకున్న టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి, అనంతపురం పరిధిలో వైసీపీ అభ్యర్థి శంకర్‌నారాయణ

అందరికీ థ్యాంక్స్: కలెక్టర్



అనంతపురం టౌన్: జిల్లాలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ సోమవారం రాత్రి ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,236 పోలింగ్‌కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించామన్నారు. ప్రతి కేంద్రంలోను వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసి జిల్లా కమాండ్ కంట్రోల్ నుంచి తెల్లవారుజాము నుంచే పర్యవేక్షించారు. ఎన్నికలు ఇంత విజయవంతంగా జరగడానికి ఎన్నికల పరిశీలకులు, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ ఆఫీసర్లు, ఏఆర్‌ఓలు, పోలింగ్ సిబ్బంది, కేంద్రబలగాలుతో పాటు ఓటర్లు, రాజకీయపార్టీల సహకారం ఎంతో ఉందన్నారు. అందుకే ప్రతి ఒక్కరికీ జిల్లా ఎన్నికల కమిషన్ తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో అధికారులు, సిబ్బంది పని చేసి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయబంతం చేద్దామని కలెక్టరు కోరారు.



హిందూపురంలో వర్షంలో గొడుగులు పట్టుకుని ఓటు కోసం క్యూలో ఉన్న ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకున్న గోనుగుంట్ల సూర్యనారాయణ, కుటుంబ సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, కుటుంబ సభ్యులు, జేసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు



ఓటు వేసిన గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, సీపీఐ రామకృష్ణ, చిలకం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు

ఓటు కోసం స్వదేశానికి..

గుంతకల్లుటౌన్: విదేశాల నుంచి వచ్చిన పలువురు ఎన్‌ఆర్‌ఐలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికల కార్యక్రమం సజావుగా జరిగింది. ఉదయం 7 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం చినుకులు పడటంతో పోలింగ్‌కు ఓటర్లు క్యూకట్టారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం ఓటు వేశాం



మాకు డల్లాస్ రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. ఓటు వేసేందుకు అక్కడి నుంచి అమీన్‌పల్లి గ్రామానికి వచ్చాము. 30 సంవత్సరాల తరువాత ఓటు హక్కు వినియోగించుకున్నాము. మన రాష్ట్రానికి రాజధాని లేదు, నిరుద్యోగాలకు ఉద్యోగ అవకాశాలు లేవు. రాష్ట్ర అభివృద్ధి కోసం, రాష్ట్రానికి మంచి పరిపాలన అందించే నాయకుడు కావాలి. అందుకోసం తాము ప్రత్యేకంగా ఒక్కరోజు ముందు 5 వేల డాలర్లు చెల్లించి టికెట్ బుక్‌చేసుకుని గ్రామానికి వచ్చి ఓటు వేశాం.

రాయల్ శివప్రసాద్, కార్తీక దాసరి దంపతులు, డల్లాస్ రాష్ట్రం, యూఎస్.

రాష్ట్ర అభివృద్ధే మా ఆకాంక్ష



సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగం చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఓటు వేసేందుకు సింగపూర్ నుంచి మా స్వగ్రామం అమీన్‌పల్లికి వచ్చాం. రాష్ట్రానికి మంచి పాలన అందించే నాయకుడు కావాలి. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నదే మా అకాంక్ష.

మల్లికార్జున, సౌజన్య దంపతులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సింగపూర్

ఓటు వేసిన ఎన్‌ఆర్‌ఐ



రొద్దం: మండలంలోని చిన్నమంతూరుకు చెందిన ఎన్‌ఆర్‌ఐ సురేంద్రనాథ్ చౌదరి సోమవారం గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అమెరికా నుంచి వచ్చి ఓటు వేసేందుకు వచ్చినట్టు ఆయన తెలిపారు.

అధికారం రానీ ... మీ కథ చూస్తా...!

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బెదిరింపులు



బీకేఎస్‌లో పోలింగ్ కేంద్రంలో జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం, మే 13: 'అధికారం రానీ.. మీ కథ చూస్తా' అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి టీడీపీ కార్యకర్తలను బెదిరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బీకేఎస్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న టీడీపీ నేతలను చూసి ఆమె రెచ్చిపోయింది. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన 141 పోలింగ్ కేంద్రంలో ఒక్క ఓటు కోసం టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నిబంధనలకు విరుద్ధంగా తన అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించింది. గెలిచేది తమ పార్టీనేనని, అధికారంలోకి వచ్చాక మీ కథ చూస్తానంటు టీడీపీ కార్యకర్తలను బెదిరించారు. టీడీపీ వారికి మద్దతుగా వ్యవహరిస్తున్నారంటూ ఎన్నికల సిబ్బందిపై చిందులు వేశారు.

కేసు నమోదు చేయండి

ఎన్నికల నిబంధనలు ఉల్లఘించి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి, ఎన్నికల సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై కేసు నమోదు చేయాలని ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, కన్వీనర్ అశోక్ డిమాండ్ చేశారు. ఈ విషయం మీద ఎంపీడీఓ శోభారాణితో వాగ్వాదానికి దిగారు. పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి టీడీపీ కార్యకర్తలపై దూషణలకు దిగడం పద్మావతికి తగదన్నారు.



ఎంపీడీఓపై మండిపడుతున్న కేశవరెడ్డి, రామలింగారెడ్డి



సాయంత్రం 5.45 గంటలైనా క్యూ లైన్‌లో భారీగా ఓటర్లు, నీరసించి కింద కూర్చుండి పోయిన ఓటర్లు

మంత్రి ఉష హల్‌చల్..!

హిందూపురం అర్బన్, మే 13: వైసీపీ పెనుకొండ అభ్యర్థి, మంత్రి ఉష శ్రీచరణ్ పరిగిలో హల్‌చల్ చేశారు. సాధారణ ఓటర్లకు అధికారులు సెల్ ఫోన్లు అనుమతించలేదు. కానీ మంత్రి రాగానే వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున్న నినాదాలు చేస్తూ ఆమె వెంట నడిచారు. పోలింగ్ కేంద్రం వద్ద ఫొటోలు తీసుకున్నారు. వారి తీరును ప్రశ్నించిన ఓటర్లకు ఉషశ్రీ చరణ్ వేలు చూపుతూ బెదిరించారు. పైడేటి పోలింగ్ కేంద్రం తలుపులు మూసివేయించి దాదాపు 15 నిమిషాలు ఆమె లోపలే ఉండిపోయారు. దీంతో టీడీపీ నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండే ఎండలో ఇబ్బంది పడుతున్న ఓటర్లు మంత్రిని నిలదీయడంతో వైసీపీ మూకలు గొడవకు దిగాయి. దీంతో కొద్దిపాటి ఉద్రిక్తత ఏర్పడింది. డీఎస్పీ బాజీజాన్ సైదా, సీఐ, ఎస్ఐ సీఆర్‌పీఎఫ్ బలగాలు అక్కడికి చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు.

పోలింగ్ నిర్వహణలో ఎస్పీ విఫలం

పోలీసు అధికారుల తీరుపై సత్యకుమార్ ఆగ్రహం



మాట్లాడుతున్న సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, మే 13: శ్రీ సత్యసాయి జిల్లాలో పోలింగ్ నిర్వహణలో ఎస్పీ, ధర్మవరంలో డీఎస్పీ, సీఐలు పూర్తిగా విఫలమయ్యారని కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ మండిపడ్డారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసు సిబ్బంది, ఎన్నికల అధికారులు ఏకపక్షంగా వ్యవహరించినా ప్రజలు మాత్రం వాటిని తిప్పి కొట్టి పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. ధర్మవరానికి చెందిన కొందరు ఆకు రౌడీలు విజృంభిస్తున్నా పోలీసు అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం సిగ్గుచేటన్నారు. రౌడీషటర్లు అయిన సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జయరామిరెడ్డి, వినయ్‌గౌడ్, మారుతి, కేశవరెడ్డి తదితరులు ఓటర్లను బెదిరించారన్నారు. సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, నాయకులు చందారాఘవ, గిర్రాజు నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాల కోసం ఓటరు తీర్పు

విలేకరుల సమావేశంలో నందమూరి బాలకృష్ణ

హిందూపురం, మే 13 : చీకటిగా ఉన్న ఈ రాష్ట్రం మార్పు కోసం, భావితరాల కోసం ఓటరు తీర్పు ఇవ్వనున్నారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. సోమవారం హిందూపురంలో ఆర్టీసీ కాలనీలో బాలకృష్ణ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటరుతీర్పే భావితరాల భవిష్యత్ కోసం అన్నారు. మీరు వేసే ఓటు మీ కోసం మీ పిల్లల కోసమన్నారు. ప్రజాతీర్పు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు దోహదపడుతుందన్నారు. అధోగతి పాలైన రాష్ట్రాన్ని పునర్‌నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎన్నడూ లేనివిధంగా దేశ విదేశాల్లో ఉన్నవారు సైతం ఓటు వేసేందుకు వచ్చారని పేర్కొన్నారు. ఈ రాష్ట్రం బాగుపడాలనే ఉద్దేశ్యంతోనే వారంతా ఓటు కోసం స్వగ్రామానికి వచ్చారని అన్నారు. ఉద్యోగులు ఎంతో ఇబ్బంది పడ్డారని, అందుకే వారు కూడా మార్పు కోరుతున్నారని వివరించారు. మూడోసారి హిందూపురంలో అధిక మెజార్టీ ఇస్తారని బావిస్తున్నా అన్నారు తెలుగుదేశం పార్టీ గెలుపు లాంఛనమే అన్నారు. ప్రజాస్వామ్యదేశంలో బలమైన ఆయుధం ఓటే అన్నారు.


అనంతపురంలో రాజేంద్ర మున్సిపల్ స్కూల్‌లో క్యూకట్టిన మహిళా ఓటర్లు


రాజేంద్ర మున్సిపల్ స్కూల్‌లో చంటిబిడ్డతో మహిళ


బుక్కరాయసముద్రంలో బారులు తీరిన ఓటర్లు


అనంతపురంలో నిర్మానుష్యంగా ఉన్న తెలుగుతల్లి కూడలి

పోటెత్తిన ఓటర్లు

- ప్రభుత్వంపై కసితోనే క్యూ కట్టారా..?
- పోలింగ్ దెబ్బకు దుకాణాలు బంద్
- అధికారికంగా కొంత, స్వచ్ఛందంగా మరికొంత..
- జిల్లా కేంద్రంలో 85 శాతం దుకాణాలు, హోటళ్లు మూత
- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలు కిటకిట
- నగరంలోని రోడ్లన్నీ నిర్మానుష్యం

అనంతపురం విద్య, మే 13 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. ఉదయం 6.30 గంటల నుంచే క్యూకట్టి.. పోలింగ్ బూత్‌లను ముంచెత్తారు. 10 గంటల తర్వాత ఆ క్యూలు మరింత పెరిగాయి. అనంతపురం అర్బన్ నియోజకవర్గం జిల్లా కేంద్రం కావడం, అత్యధిక ఓటర్లు ఉద్యోగులు, చదువర్లు కావడంతో పోలింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. జీసస్ నగర్‌లోని భాష్యం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం 168లో ఈవీఎం కొంతసేపు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. హౌసింగ్‌బోర్డు విజయనగర్ లా కళాశాలలోని పోలింగ్ కేంద్రాల్లో కూడా కొంతసేపు ఈ సమస్య తలెత్తింది. విజయనగర్ లా కళాశాల, జడ్పీలోని పంచాయతీరాజ్ డీఈ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు భారీ క్యూలతో కిటకిటలాడాయి. నగరంలోని నెహ్రూ స్కూల్లో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని సాయంత్రం ఇండియా కూటమి అనంతపురంఅర్బన్ అభ్యర్థి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, అనంతపురం లోక్‌సభ అభ్యర్థి మల్లికార్జున పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

రోడ్లన్నీ నిర్మానుష్యం


రుద్రంపేటలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్న వైసీపీ నాయకులు

ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న కసి కాబోలు.... పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. జిల్లా కేంద్రమైన అనంతపురంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోడానికి పల్లెలకు తరలి వెళ్లడంతో పాటు, నగరంలోని ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టడంతో... నగరంలోని రహదారులన్నీ జనసంచారం లేక వెలవెలబోయాయి జిల్లా కేంద్రంలోని దుకాణాలు, హోటళ్లు పెద్ద ఎత్తున మూతపడ్డాయి. ఓటుపై ప్రజల్లో ఉన్న చైతన్యం వల్ల కొందరు స్వచ్ఛందంగా దుకాణాలు మూత వేయడంతోపాటు, పోలింగ్ కేంద్రాలు, వాటికి సమీపంలోని దుకాణాలను, హోటళ్లను, టీస్టాల్స్‌కాఫీ కేఫ్‌లను బంద్ చేయించారు. దీంతో ప్రజలతో కిటకిటలాడే టీ స్టాళ్లు,కాఫీ కేఫ్స్‌లో మూతపడ్డాయి. ఉదయం టిఫెన్లు, కాఫీలకు, మధ్యాహ్నం భోజనాలు ప్రజలు ఇబ్బందులు పడ్డాయి.

ఓటేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నగరంలోని ఉమానగర్‌లో ఉన్న మొరార్జి స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నాడు. రాష్ట్రంలో ఎన్నికలు డబ్బు చుట్టూ తిరిగాయని ఆరోపించారు. అభ్యర్థుల ఇంటి వద్దకే వచ్చి ఓటర్లు డబ్బు ఇవ్వాలని అడుగడంతోపాటు, శాపనార్థాలు పెట్టే పరిస్థితులు వచ్చాయంటే..ప్రజాస్వామ్యం ఏ స్థాయికి దిగజారిందో అర్థమవుతోందన్నారు. ఏపీలోని అన్ని అన్ని జిల్లాలో రూ. 10 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా... ఎన్నికల కమిషన్ స్పందించకపోవడం దారుణమని, ఈ విషయాల్లో ఈసీ విఫలైందని విమర్శలు గుప్పించారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాజారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, ఇతర నాయకులు కేశవరెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

గుర్తింపు కార్డు లేక ఇబ్బందులు

అనంతపురం న్యూటౌన్ : ఓటు కోసం గంటల తరబడి ఓటర్లు క్యూ లైన్‌లో నిలిచున్నారు. తీర ఓటు వేయడానికి వెళ్లగా.. అక్కడ ఉన్న సిబ్బంది ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఎన్నికల నిబంధల ప్రకారం మరో ఎదైన గుర్తింపు కార్డు లేదని వారిని వెనక్కు పంపారు. దీంతో వారు ఇళ్లకు వెళ్లి మరీ ఇతర గుర్తింపు కార్డులను తెచ్చుకున్నారు. దీనిపై పలువురు ఓటర్లు సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రారంభంలోనే చెప్పితే సమస్య ఉండేది కాదని, గంటల తరబడి క్యూ లైన్‌లో ఉన్న తరువాత ఆఖరి నిమిషంలో ఇలా చెప్పడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ నాయకుల ప్రలోభాలు

అనంతపురం క్రైం : అనంతపురం నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. ఏకంగా పోలింగ్ కేంద్రాల్లోకెల్లి స్లిప్పులు పంపిణీ చేయడంతో పాటు ఓటు వేయాలని కోరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాల వద్దే ఉంటూ ఓటర్లకు పదే పదే ఓటు వేయాలంటూ కోరడం కనిపించింది. కొన్ని చోట్ల పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లి స్లిప్పులు పంపిణీ చేస్తూ కనిపించారు. ఎక్కువ కేంద్రాల్లో వలంటీర్లుతో స్లిప్పులు రాయించి పంపారు. 225, 234 పోలింగ్ స్టేషన్లలో ఈ వ్యవహారం ఎక్కువగా కనిపించింది. విషయం తెలుసుకున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి వలంటీర్లు, వైఈపీ నాయకులు ప్రయత్నిస్తుంటే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అక్కడికి వెళ్లిన టీడీపీ నాయకులు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వైసీపీ నాయకులు, వలంటీర్లను బయటకు పంపారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

దొంగ ఓట్లతో వైసీపీ కుట్ర...

కొన్ని పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ నాయకులు దొంగ ఓట్లతో కుట్రకు తెరలేపారు. విద్యారణ్యస్కూల్, కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య స్కూల్ పోలింగ్


బీకేఎస్ మండలం గోవిందంపల్లిలో రాత్రి 10గంటల సమయంలోనూ క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

బూత్ కేంద్రాలతో పాటు మరికొన్ని పోలింగ్ కేంద్రాల్లో స్థానికేతరులను పిలిపించి ఓటు వేయించినట్లు సమాచారం. కేవలం స్లిప్పుల ఆధారంగా ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండానే బలవంతంగా ఓటు వేయించినట్లు తెలిసింది. ఈ విషయంపై టీడీపీ నాయకులు అభ్యంతరాలు పెట్టినా పట్టించుకోలేదని తెలుస్తోంది. నగరంలోని 31, 33 డివిజన్లతో పాటు ఎమ్మెల్యే సొంత డివిజన్‌లో వైసీపీ నేతలు దొంగ ఓట్లు వేశారని టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ ఆరోపించారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. రీ పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతామన్నారు.

స్లిప్పులు దొరక్క పాట్లు...

ఉదయం నుంచి కొందరు ఓటర్లు అవస్థలు పడ్డారు. ఓటరు స్లిప్పులు అందజేయకపోవడంతో పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చారు. అక్కడ కూడా స్పష్టత లేకపోవడంతో ఆందోళన చెందారు. ఓటరు ఎక్కడుందో తెలియక, సంబంధిత పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లినా లేదని చెప్పడంతో కొందరు ఓటు వేయకుండానే వెనుతిరగాల్సి వచ్చింది. ఝాన్సీబాయి లక్ష్మీబాయి పాఠశాలలోని పోలింగ్ కేంద్రం, పాతూరులోని మరో పోలింగ్ కేంద్రంలో ఉదయమే ఈవీఎం మిషన్లు మొరాయించాయి. దీంతో గంటల కొద్దీ ఓటర్లు ఎదురు చూడాల్సి వచ్చింది.

ఎన్నికల్లో సాయిట్రస్టు సేవలు

అనంతపురం కల్చరల్ : సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని సాయి ట్రస్టు ఆధ్వర్యంలో పీడబ్ల్యూడీ (పర్సన్ విత్ డిసేబుల్డ్)లకు సేవలు అందించారు. దాదాపు 2895 మంది దివ్యాంగులు, మానసిక వికలాంగులు, వృద్ధులను ప్రత్యేక వాహనాల్లో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. వారు ఓటు వేసేందుకు సహకరించారు.

ఓటేసిన జనసైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్ : జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ కుటుంబసభ్యులతో కలిసి రామ్‌నగర్‌లోని మదర్‌థెరిస్సా పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాయగూరల లక్ష్మీపతి అనంతపురం రూరల్‌లోని పంచాయతీ కార్యాలయంలో పోలింగ్ బూత్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రుద్రంపేటలో వైసీపీ ప్రలోభాలు..

అనంతపురం సెంట్రల్ : రుద్రంపేట పంచాయతీ ప్రెసిడెంట్, వైసీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. అధికారులు స్పందించి వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. అదేవిధంగా టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. 32వ కేంద్రంలో ఎవీఎంలు మొరాయించడంతో ఎన్నికల ప్రక్రియ ఆలస్యంగా సాగింది.


సిండికేట్‌నగర్‌లో గొడవ పడుతున్న టీడీపీ, వైసీపీ శ్రేణులు

సిండికేట్‌నగర్‌లో ఘర్షణ

అనంతపురంరూరల్ : మండలంలోని రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌లో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన గొడవ తప్పా.. మిగిలిన అన్ని ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సిండికేట్‌నగర్‌లో పోలింగ్ కేంద్రం సందర్శనకు స్థానిక ఎమ్మెల్యే కుటుంబ సభ్యురాలు నయతారెడ్డి వచ్చారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో ఇరు వర్గాల మధ్య గొడవకు దారితీసింది. ఈక్రమంలో ఇరువర్గాలు రాళ్లు విసురుకున్నారు. అయితే ఎవరి పెద్దగా గాయాలు కాలేదు. గొడవ కారణంగా స్థానికంగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇంతలోనే విషయం తెలుసుకున్న రూరల్ సిఐ, ఇతర పోలీసు సిబ్బంది అక్కడికి చేరకుని నాయకులను చెదరగొట్టారు. ఇక మిగిలిన ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. పాపంపేట పంచాయతీ పరిధిలోని 71వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్‌లో నెలకొన్న సమస్య కారణంగా గంటకు పైగా ఓటింగ్ ప్రక్రియకు అంతరాయం కలిగింది. ఈక్రమంలో సాయంత్రం ఓటింగ్ సమయం ముగిసినప్పటికీ క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు.

మండలంలోని పాపంపేట, సిండికేట్ నగర్‌లోని పోలింగ్ కేంద్రాలను పరిటాల సునీత సందర్శించారు. అలాగే ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పాపంపేటలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

నార్పల : నార్పల మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 84 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారి రాముడు తెలిపారు. నార్పలలోని పోలింగ్ కేంద్రాలను ట్రైనీ ఐపీఎస్ అధికారి ప్రశాంత్‌కుమార్ మాధవ్ పరిశీలించారు.

కనగానపల్లి మండలంలో..

ధర్మవరంరూరల్ : కనగానపల్లి మండలవ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 6 గంటల నుంచే ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. నాలుగురోడ్ల కూడలి నిర్మానుష్యంగా మారింది. కనగానపల్లిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్ తనకుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.


గార్లదిన్నెలో పోలింగ్ సరళనిని పరిశీలిస్తున్న బండారు శ్రావణి శ్రీ

గార్లదిన్నె మండలంలో...

గార్లదిన్నె : మండలంలో 80.3 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ లోకేశ్వరీ తెలిపారు. కేశావాపురం, ముంటిమడుగు, గార్లదిన్నె తదితర గ్రామాల్లో పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మోరాయించడంతో 20 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. సంజీవపురం పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి వెళ్తుండగా.. టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో చిన్నపాటి వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసుల జోక్యంతో సమస్య సద్దుమనిగింది. గార్లదిన్నెలో పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ మధ్య స్వల్పపాటి వాగ్వివాదం జరిగింది. పోలింగ్ సరళని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ పరిశీలించారు. ద్విసభ్య కమిటి సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి స్వగ్రామమైన ముంటిడుగులో ఓటు వేశారు.

సీకేపీలో ప్రశాంతం

చెన్నేకొత్తపల్లి : మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. భారీగా క్యూ ఉన్నప్పటికి ఓపికగా ఓటర్లు ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని సీకేపల్లి, మేడాపురం, గంగినేపల్లి పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించాయి. సాయంత్రం కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 6 గంటలు దాటిన ఓటర్లు క్యూలో ఉండటంతో దాదాపు 8గంటల వరకు పోలింగ్ సాగింది. పరిటాల సునీత సీకేపల్లిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

రాత్రి 10 గంటల వరకూ పోలింగ్

రాప్తాడు : మండలంలోని బండమీదపల్లి, బొమ్మేపర్తి గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. బండమీదపల్లి గ్రామంలో 151, 152 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మెరాయించడంతో చీకటి పడినా ఓటు కొనసాగింది. రాత్రి 10 గంటల వరకూ క్యూలో నిలబడి కసిగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బొమ్మేపర్తి గ్రామంలో కూడా రాత్రి 10 గంటలకు పైగా ఓటు కొనసాగింది. బొమ్మేపర్తిలో 144 పోలింగ్ కేంద్రంలో మొత్తం 1276 ఓటర్లకు ఒక్క పోలింగ్ స్టేషన్ మాత్రమే ఏర్పాటు చేయడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్క పోలింగ్ కేంద్రంకు 1276 ఓట్లు ఉండటం, ఈవీఎంలు మెరాయించడంతో రాత్రి వరకూ ఓటింగ్ కొనసాగింది. బుక్కచెర్ల 145 పోలింగ్ కేంద్రంలో రాత్రి 8:30 గంటలకు ఓటింగ్ పూర్తయింది. బండమీపదల్లిలో ఓటింగ్ ఆలస్యమవ్వడంతో మాజీ మంత్రి పరిటాల సునీత బండమీదపల్లి గ్రామానికి వచ్చి అధికారులు, ఓటర్లతో మాట్లాడారు. ఓటింగ్ ఆలస్యంకు గల కారణాలు ఆరా తీశారు. మండలంలోని బండమీదపల్లి, బొమ్మేపర్తి మినహా మిగతా అన్ని గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. రాప్తాడులో మాజీ మంత్రి పరిటాల సునీత, పాలచెర్ల గ్రామంలో హిందూపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పార్థసారధి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

శింగనమలలో 86 శాతం ఓటింగ్

బుక్కరాయసముద్రం : శింగనమల నియోజకవర్గంలో ఓటర్లు ఓటు వేయడానికి పోటెత్తారు. ఉదయం 6 గంటల నుంచే ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వద్దకు చేరుకుని క్యూలెన్‌లో ఉన్నారు. 86 శాతం రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదైంది.

బి.కొత్తపల్లి , చెదల్ల నీలంపల్లి గ్రామాల్లో రాత్రి 10 గంటల వరుకు ఓటింగ్ పక్రియ కొనసాగింది. ఎన్నికల ఓటింగ్ సమయం సాయంత్రం ఆరు గంటల ఉండగా.. క్యూలైన్‌లో ఓటర్లు ఉండడంతో ఓటు వినియోగించుకోవడానికి రాత్రి 10 గంటల వరుకు కొనసాగింది. నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాలలో సమయం కంటే అదనం రెండు గంటల ఆలస్యంగా కొనసాగింది. నియోజకవర్గం వ్యాప్తంగా 2,47,373 ఓట్లు ఉండగా 2,00,066 మంది


బీకేఎస్‌లో ఎన్నికల సిబ్బందితో అంబికా లక్ష్మీనారాయణ వాగ్వాదం

ఓటేసినట్లు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నల శీను తెలిపారు. బుక్కరాయసముద్రం, శింగనమల, పుట్లూరు ,యల్లనూరు, గార్లదిన్నె, నార్పల మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మోరాయించాయి. దీంతో పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది.

సాంకేతిక సమస్య...

బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీలోని పోలింగ్ బూత్ నెంబరు148లో ఎంపీ అభ్యర్థి ఈవీఎం మిషన్‌లో బటన్ నొక్కితే... ఓటు పడలేదని ఎన్నికల సిబ్బందితో టీడీపీ నేతలు వాదనకు దిగారు. అనంతరం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ , వైసీపీ అభ్యర్థి శంకర్‌నారాయణ ఒకే సారి బూత్ వద్దకు వచ్చి ఎన్నికల సిబ్బందిపై మండిపడ్డారు. కొంత సేపు ఎన్నికల పక్రియ ఆగిపోయింది. అనంతరం టెక్నికల్ సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరించడంతో పోలింగ్ సాగింది.

చిన్నపాటి ఘర్షణలు

బుక్కరాయసముద్రం పోలింగ్ బూత్ నెంబరు 141లో వృద్ధుడిని ఓటు ఎన్నికల సిబ్బంది వేస్తుండగా...వైసీపీ ఏజెంట్ బూత్‌లోకి వెళ్లి చూసాడు. దీనిపై టీడీపీ - వైసీపీ ఏజెంట్లు గొడవపడ్డారు. అనంతరం పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న ఇదే విషయంపై టీడీపీ- వైసీపీ నేతలు ఒకరిని ఒకరు దాడి చేసుకున్నారు. అనంతరం పోలీసుల వచ్చి సమస్యను పరిష్కరించారు. పుట్లూరు మండలంలో ఓబుళాపురంలో గ్రామంలో ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. అందులో టీడీపీ కార్యకర్తలు రామ్మోహన్, లోకనాథ్ గాయపడగా, వైసీపీ కార్యకర్త కృష్ణయ్య గాయపడ్డారు. నార్పల మండలంలో 180 పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గీయులు స్వల్ప ఘర్షణకు దిగారు. పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో సమస్య సద్దుమనిగింది.


నార్పలలో...

నార్పలలో...

నార్పల: నార్పలలోని 182 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు పనిచేయక పోవడంతో ఉదయం 8.30 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. యల్లనూరు మండంలోని 275, 277 పోలింగ్ కేంద్రాలలో 20 నిమిషాలు ఈవీఎంలు పనిచేయకపోవడంతో కొత్త ఈవీఎంను ఏర్పాటు చేశారు. 274 పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లు మధ్య స్వల్పపాటి ఘర్షణ చోటుచేసుకుంది. టీడీపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వావాదం జరిగింది. ముంటిమడుగు, కేశవాపురంలో ఈవీఎంలు మోరాయిండంతో పోలింగ్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. పుట్లురు మండలంలోని తక్కళ్లపల్లి, కడవకల్లు, సూరేపల్లి గ్రామాల్లో ఈవీఎంలు మోరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. శింగనమలలో 84 బూత్‌లో 30 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. 83 బూత్‌లో ఎంపీకి సంబంధించిన ఈవీఎం సుమారు గంటల సేపు పనిచేయలేదు. నార్పల మండలం తన సొంత గ్రామం బొందలవాడలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ ఆలం నరసానాయుడు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రామగిరి మండలంలో...

రామగిరి: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 8గంటల వరకు కూడా పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గరిమేకలపల్లిలో రాత్రి 8గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

ఆత్మకూరు మండలంలో..

ఆత్మకూరు : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిటాల సునీత పరిశీలించారు. ఆమె వెంట మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.


బండమీదపల్లిలో రాత్రి 9 గంటల సమయంలో క్యూలో ఉన్న ఓటర్లు


ఓటేసిన టీడీపీ నాయకులు నెట్టెం వెంకటేష్, ఆలం నరసానాయుడు, జనసేన నేతలు టీసీ వరుణ్, కాయగూరల లక్ష్మీపతి


రాప్తాడులో వృద్ధురాలిని మోసుకొస్తున్న యువకుడు


అనంతపురం రామచంద్ర నగర్ చర్చి స్కూల్‌లో ఓటేసిన దివ్యాంగుడు


రుద్రంపేట 32 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మోరాయించడంతో ఓటర్ల నిరీక్షణ

మీరు రావద్దు.. వెళ్లిపోండి..!

టీడీపీ సీనియర్ నేత ఎల్.నారాయణచౌదరి వాహనాన్ని అడ్డుతగిలి .. వైసీపీ నేతల దౌర్జన్యం

చెన్నేకొత్తపల్లి: 'నీవు పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లడానికి వీల్లేదు. మేము లోపలికి వెళ్లనిచ్చే ప్రసక్తేలేదు. ఇక్కడి నుంచి తిరిగివెళ్లిపోతే మంచిది' అంటూ వైసీపీ నాయకులు టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్.నారాయణచౌదరి వాహనాన్ని అడ్డుతగిలి దౌర్జన్యాన్ని ప్రదర్శించారు. నామాల, వెంకటంపల్లి, ఓబుళంపల్లి గ్రామాల్లో పోలింగ్ సరళిని పరిశీలించడానికి చీఫ్ ఎలక్షన్ ఏజెంటు ఎల్.నారాయణచౌదరి వెళ్లారు. వైసీపీ నాయకులు పోలింగ్ కేంద్రాల్లోకి రావడానికి వీలులేదంటూ అడ్డుతగిలారు. చీఫ్ ఎలక్షన్ ఏజెంటుకు అడ్డుచెప్పడానికి మీరెవరని టీడీపీ శ్రేణులు వైసీపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు సర్దిచెప్పినా లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాల ప్రధాన గేట్లను వేసి అడ్డుగా నిలుచున్నారు. సంయమనం పాటించాలని టీడీపీ శ్రేణులకు ఎల్.నారాయణచౌదరి చెప్పడంతో పరిస్థితి సద్దుమునిగింది. నామాల గ్రామంలో టీడీపీ కార్యకర్త లోకేశ్‌పై వైసీపీ నాయకులు దాడి చేశారు. వైసీపీకి చెందిన ఇద్దరు నాయకులు ఒకేసారి పోలింగ్ కేంద్రంలోకి వెళ్తుండటంతో లోకేశ్ అభ్యంతరం తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని లోకేశ్ తెలిపారు.


వెంకటంపల్లి , ఓబుళంపల్లి పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకుల దౌర్జన్యం

ఓటర్లలో చైతన్యం.. విజయం మాదే

మాజీ మంత్రి పరిటాల సునీత ధీమా

రామగిరి, మే 13: రాప్తాడు నియోజకవర్గ ఓటర్లలో చైతన్యం కనిపించిందని, వారు మార్పు కోరుకున్నారని, గెలుపు తమదేనని మాజీ మంత్రి పరిటాల సునీత ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం నసనకోటలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని ఎప్పడికప్పుడు పర్యవేక్షిస్తూ ఈవీఎంలు మొరాయించడంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆమె మాట్లాడుతూ... నియోజకవర్గంలో పలు చోట్ల హింసాత్మక సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. తోపుదుర్తి, మేడాపురం, నామాల, మద్దలచెరువు, నెమలివరం గ్రామాల్లో వైసీపీ నాయకులు అరాచకాలకు పాల్పడ్డారని, వెంటనే దీనిపై జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. వైసీపీ నాయకులు ఎంత దౌర్జన్యం చేసిన ప్రజలు స్పష్టమైన నిర్ణయంతో ఓటు వేశారన్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నికల కూలి గిట్టింది..!

అనంతపురం సెంట్రల్, మే 13: సార్వత్రిక ఎన్నికల ప్రచారంతో కూలీలకు కూలి గిట్టింది. రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు దాదాపు నెలరోజులు పనిదొరికింది. అభ్యర్థులే మూడు పూటలా భోజన, రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. అవసరాన్ని బట్టి ఉదయం ఒక పార్టీ, సాయంత్రం మరొక పార్టీ.. ఇలా అన్ని పార్టీలు ప్రచార పని కల్పించాయని, దీంతో కొంత సొమ్మును వెనుకేసుకోగలిగామని ప్రచారంలో పాల్గొన్న వారు చర్చించుకుంటున్నారు. మరోవైపు అభ్యర్థులకు, ప్రచార కూలీలకు మధ్యవర్తులుగా పనిచేసిన వారు సైతం బాగానే జేబులు నింపుకున్నారు. ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున అభ్యర్థుల వద్దతీసుకుని రూ.500 వరకు ప్రచార కూలీలకు చెల్లించారు. 20 మందిని సమకూర్చితే రూ.10వేల వరకు గిట్టుబాటు చేసుకున్నారు. సెగల కక్కే ఎండల్లో చమటకార్చుతూ మేము ప్రచారం చేస్తే మధ్యవర్తులు లాభపడ్డారని కూలీలు పేర్కొంటున్నారు. సోమవారంతో ఎన్నికల ప్రక్రియ ముగియడంతో నేటి నుంచి యథావిధిగా సాధారణ పనులకు వెళ్లాల్సిందేనని కూలీలు అంటున్నారు. ఇతర పనులు చూసుకోక తప్పదని మధ్యవర్తులు సిద్ధమవుతున్నారు. మరో ఎన్నికలు వచ్చేవరకు వేచిచూడాల్సిందేదని పేర్కొంటున్నారు.

నేటి నుంచి యథావిధిగా కూలి పనులకు

ఈవీఎంల ఆలస్యంతో ఓటర్లకు ఇబ్బంది
● కూటమి అభ్యర్థి కాలవ


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, మే 13: ఈవీఎంలు ఆలస్యంగా ప్రారంభం కావడం వల్ల ఓటర్లను ఇబ్బంది పెట్టినట్లేనని కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం పోలింగ్ సందర్భంగా మండలంలోని దర్గాహోన్నూరు, గోవిందవాడ, బండూరు, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, నేమకల్లులలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ నమోదుపై అధికారులను ఆరాతీశారు. పెద్ద ఎత్తున ప్రజలు తమ ఓటుహక్కును ఉదయం 7 గంటలకే వినియోగించుకుంటున్నారని తెలిపారు. చాలా చోట్ల ఈవీఎంలు ఆలస్యంగా పనిచేస్తున్నాయని దీంతో ఓటింగ్ ఆలస్యంగా జరుగుతోందన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో 50 వేల మెజార్టీతో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సింగల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, తిమ్మరాజు, అప్పారావు, కేశప్ప, మహేంద్ర, పయ్యావుల మోహన్‌బాబు, పయ్యావుల అనిల్, పయ్యావుల నాగరాజు పాల్గొన్నారు.

టీడీపీ బలంగా ఉన్న కేంద్రాల్లో వైసీపీ కుట్ర
● కూటమి అభ్యర్థి పయ్యావుల కేశవ్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 13: టీడీపీ బలంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో గొడవలు సృష్టించి పోలింగ్ శాతాన్ని తగ్గించేందుకు వైసీపీ కుట్ర పన్నిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ ఆరోపించారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ సరళిని కార్యకర్తలను, నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయన్నారు. ఆ కేంద్రాల్లో అదనంగా సమయం ఇవ్వాలని కోరారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు లేక గుర్తులు కనబడలేదన్నారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న కేంద్రాల్లో గొడవలు సృష్టించడానికి వైసీపీ నేతల ఆధ్వర్యంలో కుట్రలకు తెరలేపారని విమర్శించారు. పోలీసుల దృష్టికి ఈ చర్యలను తీసుకెళ్లామన్నారు. 30వేల ఓటర్లు ఉన్న ఉరవకొండలో కేవలం పోలింగ్ స్టేషన్ల వద్ద ఒకరిద్దరుతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. ఉరవకొండలో ప్రశాంతంగా ఎన్నికలు సజావుగా జరిగేలా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు.

నా విజయం ఏకపక్షం: గుమ్మనూరు


మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

గుంతకల్లు టౌన్, మే 13: ఈ ఎన్నికలో తన విజయం, రాష్ట్రంలో పార్టీ విజయం ఏకపక్షమని ఉమ్మడి అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం జయరాం తన స్వగృహంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 45 రోజులుగా తనను నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆదరించారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో సహకరించారని అన్నారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, కేసీ హరి, ప్రతాప్ నాయుడు, యూసుఫ్, డీ బిల్వా మస్తాన్, పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో టీడీపీ విజయం తథ్యం: అమిలినేని

కళ్యాణదుర్గం, మే 13: పట్టణంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం పట్టణంలోని ప్రైమరీ నార్త్ స్కూల్‌లో పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో టీడీపీకి ప్రజలందరూ మొగ్గుచూపారన్నారు. ఓటింగ్ సరళిని బట్టి చూస్తే టీడీపీనే ఆదరించినట్లు తెలుస్తోందన్నారు. కళ్యాణదుర్గంలో అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

చంద్రన్నను గెలిపించేందుకు వచ్చాం


పురుషోత్తం, మాధవి, దుద్దేకుంట

బెళుగుప్ప, మే 13: వైసీపీ పాలనతో విసిగెత్తిన ప్రజలు టీడీపీకి ఓటేసేందుకు సుదూరప్రాంతాల నుంచి తరలివచ్చారు. చంద్రబాబునాయుడు అమలు చేసిన ఐటీ రంగంతోనే తాము ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకున్నామని దుద్దేకుంటకు చెందిన పురుషోత్తం, మాధవి అన్నారు.

చంద్రబాబు లాంటి నాయకుడు అవసరం
ఎం. రఘు, ఎన్ఆర్ఐ, దుద్దేకుంట

నేను రైతు బిడ్డను. చంద్రబాబు ప్రవేశపెట్టిన ఐటీ రంగంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందాను. ప్రస్తుతం యుఎస్ఏ డల్లాస్‌లో పనిచేస్తున్నా అక్కడి నుంచి జర్మనీకి వచ్చి బెంగళూరు చేరుకుని స్వగ్రామానికి వచ్చాను. టిక్కెట్టు రూ.2.50 లక్షలు అయింది. డబ్బు గురించి ఆలోచించలేదు. విజన్ ఉన్న నాయకుడు గెలిపించాలన్నదే తమ ధ్యేయం చంద్రబాబు వస్తేనే యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. తెలంగాణ నుంచి ఓటేసేందుకు వచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్న ఆలోచన రావడం జరిగింది.

భర్త మరణాన్ని దిగమింగి.. ఓటు వేసిన మహిళ

కణేకల్లు, మే 13: మండలంలోని జక్కలవడికి గ్రామానికి చెందిన నింగమ్మ అనే మహిళ తన భర్త మరణించిన రోజే దుఃఖాన్ని దిగమింగి ఓటు వేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న నింగమ్మ భర్త భీమలింగ ఆదివారం మృతి చెందగా సోమవారం అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంది. ఈ తరుణంలో సోమవారం ఎన్నికలు ఉండగా నింగమ్మ మాత్రం మొదటగా ఓటు వేసి వచ్చి తరువాత భర్త అంత్యక్రియలను ముగించారు.

అధికారుల నిర్లక్ష్యంతో ఓటర్లకు అవస్థలు


పడిగాపులు కాస్తున్న దివ్యాంగ ఓటర్లు

బెళుగుప్ప, మే 13: అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని ఆవులెన్న పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఇబ్బందులు తప్పలేదు. 1190 మంది ఓటర్లకు 201 పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు వెళ్లి ఓటు వేసేందుకు ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. దీంతో పోలింగ్ కేంద్రం ముందు గంటల తరబడి వీల్‌చైర్లో పడిగాపులు కాశారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఎర్రగుడి, తగ్గుపర్తి, ఆవులెన్న, గంగవరం గ్రామాల్లో రాత్రి 8 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. 7 గంటల వరకు 80 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మీడియాపై చిందులు తొక్కిన వైసీపీ నేతలు

గుత్తి, మే13: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని చిత్రీకరించేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ అయూబ్ బాషాపై వైసీపీ నేత హుసేన్‌పీరా చిందులు తొక్కాడు. అంతటితో అగకుండా దాడికి తెగబడ్డాడు. రిపోర్టర్‌ను నానాబూతులను తిడుతూ దాడికి తెగబడ్డాడు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ ఇక్కడ ఎవరూ ఉండకూడదు కవరేజ్ చేసుకుని వెంటనే వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు. వైసీపీ నాయకుల తీరు పట్ల టీడీపీ నాయకులు, స్థానిక ప్రజలు మండిపడ్డారు.

బారులు తీరిన ఓటర్లు

● మొరాయించిన ఈవీఎంలు
● పోలీస్ బందోబస్తు అంతంత మాత్రమే
● మహిళా ఓటర్లే అధికం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు బార్లు తీరారు. పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ గంట పాటు ఆలస్యమైంది. కొన్ని కేంద్రాల్లో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.


అల్లాపురంలో తలపై టువాలును నీడగా ఏర్పాటు చేసుకున్న ఓటర్లు


తెనగల్లులో వేసిన కామెడీ యాక్టర్ దస్తగిరి

కళ్యాణదుర్గం, మే 13: నియోజకవర్గంలో ఓటింగ్‌కు సోమవారం ఉదయమే బారులు తీరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓట్లు వేసేందుకు క్యూ కట్టారు. పట్టణం, రూరల్, బ్రహ్మసముద్రం, కుందుర్పి, శెట్టూరు, కంబదూరు మండలాల్లో ఉదయం నుంచి బారులు తీరారు. కంబదూరులోని 228 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో గంటన్నర పాటు పోలింగ్ ఆలస్యంగా ప్రారంభించారు. దీంతో ఓటర్లు తీవ్ర అసహనానికి గురయ్యారు. కళ్యాణదుర్గం పట్టణంలోని నార్త్ స్కూల్ వద్ద ఓటింగ్ వేయడానికి వృద్ధులు నానా అవస్థలు పడ్డారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 230785 ఉండగా, అందులో 166322 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 72.07 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్వో రాణిసుస్మిత తెలిపారు. డీఎస్పీ శ్రీనివాసులు పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

కుందుర్పి: మండలం తెనగల్లు గ్రామంలో జబర్దస్త్, టీవీ సిరియల్స్‌లో నటుడు దస్తగిరి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. హైదరాబాద్ నుంచి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికారులు సరైన వసతి కల్పించకపోవడంతో మండల పరిధిలోని అల్లాపురం పోలింగ్ కేంద్రం వద్ద మండు టెండలో బారులు తీరారు. అవస్థలు పడుతూ తలపై టవళ్లు వేసుకుని ఓటు వేశారు.

బ్రహ్మసముద్రం: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 39 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించినట్లు తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సరైన పోలీస్ బందోబస్తు లేకపోవడంతో ఓటర్లు క్యూలైన్లో నిలబడలేక కేంద్రాల్లోకి చొరబడ్డారు. కన్నేపల్లి, బుడపల్లి పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో 15 నిమిషాలు ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభించారు.

పామిడి: పట్టణంతో పాటు మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో సోమ


పామిడిలో ఎండలో నిలబడి ఉన్న మహిళా ఓటర్లు

వారం ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. 52 పోలింగ్ కేంద్రాల్లో 48053 ఓట్లు ఉన్నాయి. 75శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని 1వ వార్డు పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పంచాయతీ కార్యాలయంలోని 231వ పోలింగ్ కేంద్రంలో ఎంపీ ఓటింగ్ నమూనా యంత్రం సాంకేతికలోపంతో గంటకు పైగా ఓటింగ్ నిలిచిపోయింది. దీంతో ఓటర్లు బారులుదీరారు. ఏఆర్ఓ చంద్రశేఖర్‌తో కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ఆరాతీశారు. ఐదవ వార్డు పాఠశాలలో ఓటింగ్ కోసం వచ్చిన మహిళా ఓటర్లు ఎండలోనే గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది.

గుమ్మఘట్ట: మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. సోమవారం ఉదయం దాకా విద్యుత్ అంతరాయం వల్ల 7.30 గంటలకుపైన పోలింగ్ ప్రారంభించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు నెమ్మదిగా పనిచేయడంతో సాయంత్రం 5 గంటలు దాటినప్పటికీ పోలింగ్ కేంద్రాలలో వందల సంఖ్యలో ఓటర్లు క్యూ కట్టారు. పూలకుంట, కేపీదొడ్డి, గలగల గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 6 దాటినా ఓటు వేయడానికి వేచి ఉండడం కనిపించింది. పూలకుంట గ్రామంలో ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉండడంతో పాటు ఈవీఎంలు నెమ్మదిగా పనిచేయడంతో ఆలస్యమైనట్లు గ్రామస్థులు తెలిపారు. ఆ గ్రామాలలో రాత్రి పోలింగ్ ముగిసేందుకు 10 గంటల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈవీఎంల మొరాయింపు

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అక్కడక్కడ చెదురు ముదురు సంఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పట్టణంలోని 123వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో అరగంట తర్వాత పోలింగ్ ప్రారంభమైంది. వజ్రకరూరు మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటు వేసేందుకు క్యూలైన్లో బారులు తీరారు. గడేహోతూరులో సాయంత్రం 7గంటల దాకా పోలింగ్ కొనసాగింది. ఉరవకొండ మండలంలో షేక్షానుపల్లి, షైలారాంపల్లి గ్రామాలలో సాయంత్రం 6గంటల సమయంలో కూడా ఓటర్లు క్యూలైన్లో ఉండడంతో ఓటింగ్ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువత పోలింగ్ రోజు


రాంపురంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

కోసం ఎంతో ఆసక్తి ఎదురుచూశారు. చదువు, ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంగా సొంత ఊర్లకు వచ్చారు. పోలింగ్ కేంద్రాలకు ఉత్సాహంగా వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

డీ.హీరేహాళ్: మండల వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 16 గ్రామ పంచాయతీలలో 34 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒకటి, రెండు మినహా మిగిలిన అన్ని పోలింగ్ స్టేషన్‌లో ఉదయం ఏడు గంటలకే ప్రక్రియ ప్రారంభించారు. పోలైన ఓట్లు ఈవీఎం మిషన్ నందు ఓట్లకు సంబంధించి తేడా రావడంతో కాసేపు పోలింగ్ ప్రక్రియ వేయడం జరిగినది. తిరిగి అధికారుల సూచనల మేరకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు.

గుత్తిరూరల్: మండల వ్యాప్తంగా సోమవారం సార్వత్రిక ఎన్నికలు


బాచుపల్లిలో బారులు తీరిన ఓటర్ల

సజావుగా సాగాయి. 36 గ్రామాల్లో 39 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఓటర్ల బారుతీరారు. బేతాపల్లి, అబ్బేదొడ్డి, తొండపాడు, ఊటకల్లు గ్రామాల్లో రాత్రి వరకు క్యూలలో ఓటు వేయడానికి బారులు తీరారు. అక్కడ అధికారులు ఓటర్లకు టోకన్‌లను అందజేసి ఓటింగ్ ప్రకియ కొనసాగించారు. బేతాపల్లిలో రాత్రి 10 గంటల వరకు కొనసాగే అవకాశం ఉంది.

గుంతకల్లుటౌన్: నియోజకవర్గంలో పలు చోట్లు పోలింగ్ కార్యక్రమం నెమ్మదిగా నడిచింది. ఈవీఎంలు మొరాయించడం, రిసిప్ట్ యంత్రం మొరాయించడం, తదితర కారణాలతో పోలింగ్ కార్యక్రమం పలుచోట్ల ఆలస్యంగా ప్రారంభమైంది. గుంతకల్లు పట్టణంలోని జీబీసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఎస్‌జేపీ ఉన్నత పాఠశాల కేంద్రంలో ఈవీఎం పనిచేయని కారణంగా అరగంటసేపు పోలింగ్ ఆలస్యమైంది.

రాత్రి 9 గంటల వరకు పోలింగ్


కురవళ్లిలో రాత్రి అయినా ఓట్లు వేసేందుకు వేచి ఉన్న ఓటర్లు

బొమ్మనహాళ్: సార్వత్రిక ఎన్నికలు సోమవారం రాత్రి 9 గంటల వరకు పైగా పోలింగ్ కొనసాగింది. మండలంలోని దర్గాహోన్నూరు, సింగానహళ్లి, కురవళ్లి, సిద్ధరాంపురం తదితర గ్రామాలలో రాత్రి 9 గంటల పై వరకు ఎన్నికల పోలింగ్ కొనసాగింది. ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వేచి ఉన్నారు. 6 గంటలకు పోలింగ్ సమయం ముగియడంతో క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు ఎన్నికల అధికారులు కూపన్లు జారీ చేసి బయట ఉన్న వారిని లోపలకు రాకుండా చేశారు. మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో వాదోపవాదనలు జరిగాయి. ఎల్‌బీనగర్ గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గాలు పోలింగ్‌బూత్‌ల వద్ద ఒకరినొకరు వాదనలు చేసుకుని ఇరువురు బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

వర్షాన్ని లెక్క చేయని ఓటర్లు

కూడేరు: మండలంలో పోలింగ్‌కు ఓటర్లు భారీగా తరలివచ్చారు. సోమవారం వేకువజాము నుంచి వర్షం కురుస్తున్నా ఓటర్లు తమ ఓటు


ఇప్పేరు గ్రామంలో వర్షంలో బారులు తీసిన ఓటర్లు


కళ్యాణదుర్గం పట్టణంలో బారులు తీరిన ఓటర్లు

హక్కును వినియోగించుకోవడానికి క్యూలో నిల్చున్నారు. మండలంలో 37 పోలింగ్ కేంద్రాలు ఉండగా 32,264 ఓటర్లు ఉన్నారు. ఉదయం నుంచి అన్ని పోలింగ్ కేంద్రాల్లో పెద్ద ఎత్తున్న ఓటు వేయడానికి బారులు తీశారు. జల్లిపల్లి, కల్లగళ్ల గ్రామంలో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైయ్యింది. మరుట్ల, కల్లగళ్ల. నాగిరెడ్డిపల్లి. ఇప్పేరు, శివరాంపేట, తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో చిత్తడిగా ఉన్నా ఓటు వేయడానికి ఓటర్లు ఉత్సహంతో తరలివచ్చారు.

యాడికి: చెదురు, మదురు ఘటనల మధ్య మండలంలో పోలింగ్ కొన


యాడికిలో బారులు తీరిన మహిళా ఓటర్లు

సాగింది. యాడికిలోని ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు పనిచేయకపోవడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. నగరూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్ రామచంద్రారెడ్డిపై వైసీపీ మండల నాయకుడు దురుసుగా ప్రవర్తించాడని బాధితుడు తెలిపాడు. దీంతో టీడీపీ, వైసీపీ నాయకులు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. ఈ సంఘటనతో పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు చేరుకొని ఇరువర్గాల వారిని పంపించేశారు. పోలింగ్ సరళిని పరిశీలించడానికి వచ్చిన వైసీపీ ఎంపీ అభ్యర్థి శంకర నారాయణ వెంట వైసీపీ నాయకులు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడంతో టీడీపీ నాయకులు అడ్డు చెప్పారు. వేములపాడులో పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నాయకులు ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలుచేశారు. టీడీపీ నాయకులు దీటుగా ఎదుర్కొవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

పెద్దవడుగూరు: మండలంలో చెదురుమదురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కాశేపల్లి, కోనాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. మండలకేంద్రంలోని పోలింగ్ బూత్ ఆవరణంలో ఓటర్లను వైసీపీ మద్దతుదారులు ప్రలోభాలకు గురిచేస్తుండడంతో టీడీపీ నాయకులు అడ్డుపడడడంతో వెనుదిరిగారు. దిమ్మగుడి గ్రామంలో వైసీపీ కార్యకర్త రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

యల్లనూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం నిర్వహించిన పోలింగ్‌లో ఓటర్లు కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయాన్నే మహిళలు పెద్దఎత్తున ఓటు వేయడానికి వచ్చారు. 274, 275 పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దిఓటర్ల క్యూ పెరుగుతుండడం కనిపించింది.

గుత్తి, : పట్టణంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం జరిగిన


గుత్తిఆర్ఎస్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగినప్పటికి అక్కడక్కడ చెదరుముదురు సంఘటనలు జరిగాయి. పలు కేంద్రాల్లో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పట్టణంలో37, గ్రామీణ ప్రాంతంలో 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 174 పోలింగ్ కేంద్రంలో 8గంటలు కావస్తున్న పోలింగ్ ప్రారంభం కాకపోవడంతో ఓటర్లు బారులు తీరారు. దీంతో ఓటర్లు ఆందోళన చేశారు. ఓటు వేయడానికి లోపలికి పంపలేదని పోలీసులతో వాగ్వివాదం దిగారు. అనంతరం పోలీసులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది.గుత్తిఆర్ఎస్‌లోని 208, 209 పోలింగ్ బూత్‌ల వద్ద నత్తనడకగా పోలింగ్ సాగింది. అయితే మహిళలు, పురుషులకు వేరువేరుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఒకే బారికేడ్‌లో మహిళలు, పురుషులు ఓటు వేసేందుకు అధికారుల ఏర్పాటు చేయడంతో మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

సోదరిని కోసం..


దివ్యాంగురాలైన సోదరిని ఎత్తుతికొస్తున్న అన్న

పట్టణంలోని కామాట వీధికి చెందిన గజనీమహమ్మద్ వికలాంగురాలైన సోదరి ఫాతిమాకు ఎలాగైనా ఓటు వేయించాలన్న ఉద్దేశ్యంతో తన చెల్లెలను ఎత్తుకుని పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించేలా చేశాడు. తాను ఓటు వేసినందుకు ఫాతిమా ఆనందం వ్యక్తం చేసింది.

వైసీపీ నాయకుల దౌర్జన్యం


వైసీపీ నాయకులపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

విడపనకల్లు, మే 13: వైసీపీ నాయకులు, కార్యకర్తలు అన్ని పోలింగ్ కేంద్రాల్లోకి చుట్టాల్లా వెళ్లి వచ్చారు. దీంతో టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన వారు పట్టించుకోలేదు. మధ్యాహ్నం వరకూ చూసినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో విసిగిపోయిన టీడీపీ నాయకులు వాదనకు దిగారు. 26వ పోలింగ్ బూత్‌కు సిద్దు అనే వైసీపీ కార్యకర్త ఏజెంట్‌గా ఐడీ చూపించాడు. కానీ సిద్దు అనే కార్యకర్త 23, 24, 25వ పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లటంతో టీడీపీ నాయకులు అతన్ని బయటకు రావాలని ఆందోళన చేశారు. వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయి టీడీపీ నాయకుడు హనుమంతుపై దాడికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. వైసీపీవారిని చెదరగొట్టారు.

అబ్బేదొడ్డిలో దాడి


గాయపడిన నవీన్ కుమార్‌ను పరామర్శిస్తున్న గుమ్మనూర్ నారాయణ

గుత్తి రూరల్, మే13: అబ్బేదొడ్డి గ్రామంలో టీడీపీ వర్గీయులపై వైసీపీ వర్గీయులు దాడి చేశారు. దీంతో ఇద్దరు గాయపడ్డారు. టీడీపీ వర్గీయుడు శంకరయ్య గౌడ్ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో అతడి కుమారులు నవీన్ కుమార్ గౌడ్, పవన్ కుమార్‌గౌడ్ పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లారు. ఓటర్ల క్యూ ఎక్కువగా ఉండటంతో పోలీసుల అనుమతితో లోపలికి తీసుకెళ్తుండగా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. వైసీపీ నాయకులు కేశవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి, బోయ తులసి, చిరంజీవిరెడ్డి వారిపై కర్రలతో దాడి చేశారు. దీంతో నవీన్ కుమార్ గౌడ్, పవన్ కుమార్ గౌడ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు నవీన్ కుమార్ గౌడ్‌ని అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ నాయకుల వాటర్‌ప్లాంట్ ధ్వంసం

కణేకల్లు, మే 13: మండలంలోని సొల్లాపురం గ్రామంలో టీడీపీ నాయకుడు డాక్టర్ నీలకంఠారెడ్డి ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను వైసీపీ నాయకులు ధ్వంసం చేశారు. గ్రామంలో పేద ప్రజల కోసం మూడేళ్ల క్రితం నీలకంఠారెడ్డి తన తల్లిదండ్రులు గోనపాటి సీతమ్మ, ఈశ్వరరెడ్డిల జ్ఞాపకార్థం లక్షల వ్యయంతో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ఉచితంగా పేద ప్రజలకు అందిస్తున్నారు. ఇటీవల గ్రామంలో టీడీపీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. ఆదివారం అర్ధరాత్రి వాటర్‌ప్లాంట్ వద్దకు వెళ్లి నీటిని సరఫరా చేసే పైప్ లైన్‌తో పాటు పలు పరికరాలను ధ్వంసం చేశారు.

మోస్తరు వర్షం

రాయదుర్గంరూరల్, మే 13: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఉక్కపోత తగ్గింది. పలు గ్రామాలలో ఈ వర్షానికి చెక్‌డ్యాంలలో నీరు చేరాయి. ఎండవేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం కలిగింది.

వైసీపీ నాయకుల హల్‌చల్

ఉరవకొండ, మే13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు హల్‌చల్ చేశారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 4 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. టీడీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లారు. వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి తనయుడు ప్రణయ్ రెడ్డి తన అనుచరులతో కలిసిపోలింగ్ కేంద్రానికి వచ్చి హల్‌చల్ చేశారు. ఈ పోలింగ్ కేంద్రం ప్రాంగణంలోనే కూర్చొని, అక్కడ ముస్లిం మైనార్టీ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి పోలింగ్‌ను తప్పుదోవ పట్టించడానికి కవ్వింపు చర్యలకు దిగారు. దీనిని చూస్తున్న అధికారులు పట్టీపట్టనట్లుగా ఉండడం చర్చనీయాంశంగా మారింది.

కూడేరు: మండలంలోని జల్లిపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రం క్యూలైన్లో వైసీపీ నాయకులు ప్రచారం చేస్తుండటంతో టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఇరువర్గాలు గొడవపడ్డారు. మరుట్ల 1వ కాలనీలో టీడీపీ కార్యకర్త బ్రహ్మయ్య వారి కుటుంబ సభ్యులతో ఓటేసేందుకు వెళ్లిన సమయంలో వైసీపీ నాయకులు అడ్డుకున్నారు.

ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌పై దాడి యత్నం

విడపనకల్లు, మే 13: పోలింగ్ కేంద్రం వద్ద జరుగుతున్న ఘర్షణను ఫొటోలు, వీడియోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి విలేకరిపై ఐదుగురు వైసీపీ కార్యకర్తలు దాడికి యత్నించారు. వైసీపీకి చెందిన దేశాయి సిద్దు, చింత కుంట నాగరాజు, సింగాడి నాగరాజు, పెద్ద ఉలిగన్న, బోయ తాతప్ప గారి వీరాంజి సెల్‌ఫోన్ లాక్కునే ప్రయత్నం చేశారు. మా వీడియోలు, ఫొటోలు తీస్తే నీవు జాగ్రత్త అంటూ హెచ్చరించారు. అయితే పోలీసు సిబ్బంది వారిని చెదరగొట్టారు. ఈ క్రమంలోనే 'ఆంధ్రజ్యోతి' విలేకరి పోలింగ్ కేంద్రాల వద్ద ఉండకూడదు అని విడపనకల్లు ఎస్ఐ హూంకరించాడు. అయితే జగన్ పత్రిక విలేకర్లు అందరూ పోలింగ్‌కేంద్రాల్లోకి వెళ్లివస్తున్నా ఏమాత్రం పట్టించుకోలేదు.

పోలింగ్ నిర్వహణలో వైఫల్యం


వర్షంలో ఓటు వేసేందుకు క్యూకట్టిన ఓటర్లు

రాయదుర్గం, మే 13: ఎన్నికల నిర్వహణలో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. పోలింగ్ కేంద్రాల వద్ద గంటల కొద్ది ఓటర్లు నిలబడి క్యూ కట్టాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలోని 20 కేంద్రాలకు పైగా సమయం ముగిసినా రాత్రి 10 గంటల వరకు ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకునేందుకు క్యూకట్టారు. ప్రధానంగా ఈవీఎంల మొరాయింపులు చాలా చోట్ల కనిపించాయి. కోకుర్తితో పాటు రాయదుర్గం పట్టణంలోని జూనియర్ కళాశాల తదితర చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో రెండు గంటల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పాత హడగలిలో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఏకంగా మాక్ పోలింగ్ ఓటర్లను కూడా కలిపివేసి కౌంటింగ్‌లో పెట్టడంతో గంటపాటు గందరగోళం నెలకొంది. పోలింగ్ నిలిపివేసి దీనిపై స్పష్టత వచ్చేదాకా నిరీక్షించారు. రాయదుర్గం పట్టణంలోని బాలికల హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలలో రాత్రి వర్షానికి పెద్ద ఎత్తున నీరు చేరుకోవడంతో ఉదయాన్నే వర్షం నీటిలో బారులు తీరి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాయదుర్గంరూరల్, మే 13: కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆసుపత్రికి తీసుకెళుతుండగా సోమవారం సాయంత్రం బీటీపీ లేఅవుట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి రాజు(30) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల మేరకు గుమ్మఘట్ట మండలం 75 వీరాపురం గ్రామానికి చెందిన రాజు రాయదుర్గం పట్టణంలో ద్వారకా హోటల్‌లో మాస్టర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. చిన్న కుమారునికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ద్విచక్రవాహనంలో భార్య రామలక్ష్మి, కుమారుడు టీ వీరాపురం నుంచి రాయదుర్గం ఆసుపత్రికి తీసుకెళుతుండగా బీటీపీ లేఅవుట్ వద్ద ఆటో ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.